క్లుప్తంగా

నేడు హాకీ మైదానం ఆధునికీకరణ

- రూ.1.60 కోట్లతో పనులు
- మంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన

నక్కపల్లి : మండల కేంద్రంలో రూ.1.60 కోట్లతో హాకీ క్రీడా మైదానం ఆధునికీకరణ పనులకు రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ్ అమర్‌నాథ్ శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. హాకీ క్రీడాకారుల కోసం నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడామైదానాన్ని ఆధునికీకరించేందుకు క్రీడా మంత్రిత్వశాఖ రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో హాకీ క్రీడాకారులతో పాటు ఇతర క్రీడలు ఆడేందుకు అవసరమయ్యే విధంగా ఆధునికీకరణ పనులు చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం జరిగే ఈ పనును రాష్ట్రమంత్రి అమర్‌నాథ్ శంకుస్థాపన చేస్తారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావు,నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు, స్థానిక నాయకులు హాజరు కానున్నారు.

పార్టీ విజయానికి కృషి చేస్తా...



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ అప్పల నరసింహ

ఎస్.రాయవరం : చిన్నగుమ్ములూరు సర్పంచ్ గాడి అప్పలనరసింహ గురువారం స్వంత పార్టీ గూటికి చేరాడు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనివార్య కారణాలుగా కొన్ని నెలలుగా పార్టీకి దూరంగా ఉన్నా తిరిగి యథావిధిగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొని, వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని చెప్పారు. ఈమేరకు గ్రామంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు గోవిందరావు, జెడ్పీటీసీ కాకర దేవి, జిల్లా పార్టీ కార్యదర్శి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు చొప్పా రాజు, మధువర్మ, శ్రీనువాస్, మల్లేష్ పాల్గొన్నారు.

గొర్రెలు, మేకల పెంపకానికి రుణాలు

కోటవురట్ల: పాడి రైతులకు పశు సంవర్ధక శాఖ ఆసరాగా ఉందని, గొర్రెలు, మేకల పెంపకానికి 50 శాతం రాయితీపై రుణాలు అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరక్టర్ నరసింహులు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పశు వైద్య సిబ్బందితో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పశు సంవర్ధక శాఖ ద్వారా కలుగుతున్న లబ్ధిని వివరించి రైతులను ప్రోత్సహించాలని అన్నారు. రాయితీపై గడ్డి విత్తనాలు, మెషిన్లు కూడా అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ సింహాద్రప్పడు, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మునగపాక : మండలంలోని ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.మన్మథరావు తెలిపారు. చెర్లోపాలెం సచివాలయం రామగిరిలో మహిళ(బీసీ-డీ),మునగపాక-2 సచివాలయం మహిళ (బీసీ-బీ), నాగులాపల్లి బీసీ-మహిళ, ఎస్సీ-మహిళకు సంబంధించి ఖాళీగా ఉన్నాయన్నారు. పదో తరగతి పాసై 18 సంవత్సరాలు నిండిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 2వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 4వ తేదీన దరఖాస్తుల పరిశీలన , ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఎంపిక కాబడిన అభ్యర్థులకు ఈ నెల 6వ తేదీన నియామక పత్రాలు అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

గంగాదేవిపేటలో రక్షితనీటి పథకం



మంచినీటి పథకానికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక : జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీటి సమస్యలు పరిష్కారమవుతాయని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు ద్వారా సురక్షమైన తాగునీరు అందుతుందన్నారు. గంగాదేవిపేటలో రూ.43 లక్షలతో రక్షిత మంచినీటి పథకానికి గురువారం ఆయన భూమిపూజ చేశారు. మూలపేట సర్పంచ్ గంగప్పలనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు,ఉప సర్పంచ్ దేవీచంద్ర పాల్గొన్నారు.

సచివాలయాలు దేశానికే తలమానికం



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు బాబూరావు, జోగులు

నక్కపల్లి : రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికమని స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం వారు చినతీనార్లలో సచివాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ గ్రామ స్వరూపాన్ని మార్చివేసిందన్నారు. ప్రజలకు మండల కార్యాలయాలను మర్చిపోయేలా చేసిందన్నారు. ఏ పని కావాలన్నా సచివాలయానికి వెళ్తే క్షణాల్లో పూర్తవుతోందన్నారు. అనేక వ్యయ ప్రయాసలు పడే ఇబ్బందులు తప్పడంతో ప్రజలంతా ఈ సచివాలయ వ్యవస్థను సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా దళారుల ప్రమేయం పూర్తిగా తొలగిపోయిందన్నారు. ప్రజలు నేరుగా సచివాలయానికి వెళ్లి వారికి కావాల్సిన పనులు చేయించుకునే విధంగా ఈ వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దారని అన్నారు. 12 ప్రభుత్వ శాఖల సిబ్బంది ఈ కార్యాలయాంలో అందుబాటులో ఉండడం వల్ల ప్రజల పనులు సులభంగా పరిష్కారమవుతున్నాయన్నారు. సచివాలయ వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుని అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాయన్నారు. ఇతర దేశాలు, నీతిఆయోగ్ వంటి సంస్థలు కూడా సచివాలయ సేవలను మెచ్చుకుంటున్నాయన్నారు. బాపూజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సచివాలయాల ద్వారా సాధ్యం చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలతోపాటు, త్వరలోనే భూములు, ఇతర చర స్థిరాస్తుల క్రయవిక్రయాలు సచివాలయాల్లోనే జరగనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, సర్పంచ్ ఎరిపల్లి మునలయ్య, మండల కో ఆప్షన్ సభ్యుడు లొడగల చంద్రరావు, జేసీఎస్ కన్వీనర్ సూరాకాసుల గోవిందు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పూడిమడక రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

మరమ్మతులకు ఎమ్మెల్యే కన్నబాబు భూమిపూజ



పూడిమడక రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. నెలల తరబడి పరిష్కారానికి నోచుకోని పూడిమడక రోడ్డు శాశ్వత పనులు ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. వీఎంఆర్‌డీఏ సహకారంతో పూడిమడక రోడ్డుకు మోక్షం కలిగిందన్నారు. అనకాపల్లి జాతీయ రహదారి నుంచి అచ్యుతాపురం వరకు ఉన్న 14 కిలోమీటర్ల మేర రహదారికి శాశ్వత పనుల కోసం గురువారం ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తిరాజు మాట్లాడుతూ పూడిమడక రోడ్డులో పరిమితికి మించి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రోడ్డు దెబ్బతిందన్నారు. దీనికి వీఎంఆర్‌డీఏ ద్వారా రూ.6.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరితగతిన రహదారి పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈరోడ్డుపై భారీ వాహనాల రాకపోకలు జరగకుండా చూస్తామన్నారు. యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి,డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,వీఎంఆర్‌డీఏ డీఈ శ్రీహరి,వైఎస్సార్‌సీపీ నేతలు మారిశెట్టి సూర్యనారాయణ,పిన్నమరాజు వాసు,దేశంశెట్టి శంకరరావు,సర్మాల కుమార్,కోన బుజ్జి,మొల్లేటి వినోద్‌కుమార్,బొడ్డేడ చెల్లయ్యనాయుడు,బొద్దపు శ్రీరామమూర్తి,దొడ్డి బాలాజీ,సూరిశెట్టి రాము, ఆడారి కాశీబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం

ఎస్.రాయవరం: పెదఉప్పలం గ్రామంలో శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్టు సర్పంచ్ కోశెట్టి వెంకటరమణ తెలిపారు. సర్పంచ్ స్వామి వారికి 3 వందల గ్రాములు వెండి కిరీటం, పాయకరావుపేట ఇన్‌చార్జ్, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, రాజ్యసభ సభ్యుడు పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు చేతుల మీదుగా స్వామివారికి అలంకరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

ఎంఎస్‌ఎంఈ చైర్మన్‌కు అభినందనలు



ఎంఎస్‌ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

కోటవురట్ల: ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి. సూర్యనారాయణరాజును గురువారం పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తంగేడులోని ఆయన నివాసం సందడిగా మారింది. ఎస్.రాయవరం వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందు, యువజన విభాగం జిల్లా కార్యదర్శి చామంతుల శ్రీనివాస్, ఐటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి బాబ్జీ, పార్టీ నాయకులు గొల్లు చిట్టిబాబు, పైల నాని, ఉప సర్పంచ్ శ్రీను, మాజీ సర్పంచ్ పైల శ్రీరామ్మూర్తి తదితరులు కలుసుకుని ఆయనను సన్మానించారు.

పాలనా కేంద్రాలుగా సచివాలయాలు

- ఎమ్మెల్యే రమణమూర్తిరాజు
- రూ.43.60 లక్షలతో రేగుపాలెం సచివాలయ భవనం ప్రారంభం



రేగుపాలెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : గ్రామ సచివాలయాలు పరిపాలన కేంద్రాలుగా నిలుస్తున్నాయని యలమంచిలి ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. రేగుపాలెం గ్రామంలో గురువారం రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలసి ప్రారంభించారు. నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలకు నూతన భవనాలు నిర్మించడం జరిగిందని, సచివాలయాల ద్వారా ప్రజలందరికీ సకాలంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, వైస్ ఎంపీపీ శేషు, గ్రామ సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, యలమంచిలి రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, రేగుపాలెం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాన శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు పటిష్ట బందోబస్తు



గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి: ఇంటర్‌పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు సీఐ విజయకుమార్ తెలిపారు. మండలంలో ఇంటర్ పరీక్షలు జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల కళాశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బందోబస్తు కోసం తీసుకోవాల్సిన చర్యలపై ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లతో చర్చించారు. మాస్ కాపీయింగ్‌నకు అవకాశం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. పరీక్ష రాసే విద్యార్థులు అరగంట ముందే పరీక్ష కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల ఆవరణలో ఇన్‌విజిలేటర్లు, కళాశాల సిబ్బంది మినహా బయట వ్యక్తులకు అనుమతి లేదన్నారు.

అడవిరాజుల గుడి ప్రారంభం



అడవిరాజులను దర్శించుకున్న ఎంఎస్‌ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

కోటవురట్ల : ఆలయాలు ధర్మాన్ని ప్రబోధిస్తాయని ఎంఎస్‌ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు అన్నారు. కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో అడవిరాజుల గుడిని గురువారం వైభవంగా ప్రారంభించారు. పల్లెల్లో గ్రామ దేవతల పండగలు ఐక్యతను చాటుతాయన్నారు. మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు ఆర్థిక సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచ్ పి.నూకరత్నం, యువజన విభాగం జిల్లా కార్యదర్శి చామంతుల శ్రీనివాసు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి ఘన సత్కారం



అప్పారావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: ఉద్యోగం నుంచి పదవీ విరమణ పొందిన వారు శేష జీవితం సుఖమయంగా గడపాలని దార్లపూడి సర్పంచ్ సుభాషిణి అన్నారు. పాఠశాలలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ గురువారం పదవీ విరమణ పొందిన గవ్వా అప్పారావుని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దాసు, జాన్ పాల్గొన్నారు.

మోదకొండమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి కలశాలతో వస్తున్న భక్తులు

మునగపాక: మునగపాకలో మోదకొండమ్మ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. వేద పండితులు కోటేశ్వర శర్మ మంత్రోచ్ఛరణల నడుమ శంకుస్థాపన వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యులంతా కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. బైపాస్‌ను ఆనుకొని దాతల విరాళాలతో ఆలయం నిర్మించనున్నారు.

అమ్మవారి ఆలయానికి దాతల విరాళం



ఉమ్మలాడలో ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న వాసు

మునగపాక : ఉమ్మలాడలో నూతనంగా పునర్నిర్మాణం చేపడుతున్న దేవీతల్లి అమ్మవారి ఆలయానికి దాతలు ముందుకొస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం వ్యాపారవేత్తలు మొల్లేటి వాసు రూ.లక్షా 116, మొల్లేటి వెంకట చిన్నారావు రూ.50,116 నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పల్లె అప్పలనాయుడు మాట్లాడుతూ దాతలు ముందుకొచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

3న కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవం



గవర్ల అనకాపల్లిలోని కోదండ సీతారామచంద్ర స్వామి

మునగపాక: గవర్ల అనకాపల్లిలో ఈ నెల 3న శ్రీ కోదండ సీతారామచంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కాండ్రేగుల సూర్యనారాయణ తెలిపారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

సూక్ష్మనీటి సేద్యంతో అధిక లాభాలు



మైక్రో ఇరిగేషన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న వరలక్ష్మి

నక్కపల్లి : బిందుసేద్యం, సూక్ష్మనీటి సేద్యం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని మైక్రో ఇరిగేషన్ ఏపీడీ వరలక్ష్మి అన్నారు. గురువారం ఆమె జగన్నాథపురంలో రైతులకు బిందు, సూక్ష్మనీటి సేద్యంపై అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడుకుంటే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. దీని కోసం ప్రభుత్వం 90 శాతం సబ్సిడీతో రైతులకు సూక్ష్మ, బిందుసేద్యం పరికరాలను అందించి ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఉద్యాన పంటలకు అపరాలు, కూరగాయల పంటలకు సూక్ష్మనీటి సేద్యం యూనిట్లు ఉపయోగపడతాయన్నారు. ఆసక్తి కలిగిన రైతులు పేర్లు నమోదు చేయించుకుని యూనిట్లు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు కరణం ఈశ్వరరావు, కాకర వెంకటరావు పాల్గొన్నారు.

వాహన డ్రైవర్లు రహదారి నిబంధనలు పాటించాలి



డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

నక్కపల్లి : జాతీయరహదారితో పాటు, గ్రామీణ రోడ్లలో ప్రమాదాల నివారణకు ఆటోవాలాలు సహకరించాలని సీఐ విజయ్‌కుమార్ కోరారు. ఆయన గురువారం నక్కపల్లిలో నూకతాత ఆటో వర్కర్ల యూనియన్‌తో సమావేశం నిర్వహించారు. ఆటోడ్రైవర్లు వాహనం నడిపేటప్పుడు లైసెన్సు కలిగి ఉండడంతో పాటు రికార్డులు సక్రమంగా ఉండాలని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాలకు ప్రయాణికులు బలవుతున్నారన్నారు. అందువల్ల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సరైన రికార్డులు లేని, ప్రమాదాలకు గురైన వాహనాలకు బీమా వర్తించదన్నారు.

పట్టణంలో శరవేగంగా రహదారుల నిర్మాణం

- మున్సిపల్ కమిషనర్ కొండలరావు
- రూ.22 లక్షలతో ధర్మవరంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం



ధర్మవరంలో సీసీ రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ కొండలరావు

యలమంచిలి : పట్టణంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణపు పనులు శరవేగంగా జరుగుతున్నాయని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు అన్నారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి ధర్మవరంలో రూ.22 లక్షలతో నూతనంగా నిర్మస్తున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో పట్టణంలో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, కల్వర్టులు నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. త్వరితగతిన పనుల పూర్తికి చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళా మార్టులు మరిన్ని విస్తరించాలి

అడ్డురోడ్డులో మార్టు ప్రారంభించిన గొల్ల బాబూరావు, కంబాల జోగులు



ప్రారంభించిన మార్టులో సరుకులు కొనుగోలు చేస్తున్న గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామాల్లో మహిళా మార్టు ద్వారా నాణ్యమైన సరుకులు ప్రతి ఒక్కరూ కొనుగోలు చేసుకోవచ్చని స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త కంబాల జోగులు అన్నారు. అడ్డురోడ్డు జంక్షన్‌లో రూ. 45 లక్షలతో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చేయూత మహిళా మార్టు గురువారం ఎమ్మెల్యేలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్టు ప్రయోజనాలు మహిళలు అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలన్నారు. రాయితీతో కూడిన నాణ్యమయిన కిరాణా ఇతర సామాగ్రి కొనుగోలు చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ మార్టు నియోజకవర్గానికి ఒకటిగా కాకుండా మండలానికి ఒకటి చొప్పున విస్తరింపజేయాలన్నారు. పట్టణ ప్రాంతం మాదిరిగా గ్రామాల్లో మార్టులు ఏర్పాటు చేసి, రాయితీకి ప్రముఖ కంపెనీలు వస్తువులు అందివ్వడం అభినందనీయమన్నారు. మూడు మండలాల కూడలి అడ్డురోడ్డులో ఏర్పాటు చేసిన మార్టు చాలా ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోనికి వచ్చిన తరువాత అనేక సంస్కరణలు తీసుకువచ్చారని, వాటిలో ఈ మహిళా మార్టు ఒకటని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏపీడీ సీహెచ్ వరప్రసాద్, డీపీఎం ఫైనాన్స్ పి.శ్రీనివాస్, స్త్రీనిధి మేనేజర్ కరుణానిధి, ఏరియా కోఆర్డినేటర్ సీహెచ్ సత్యవేణి, ఏపీఎం శివప్రసాద్, మార్టు అధ్యక్షులు మత్తి రూప, యలమంచిలి క్లస్టర్స్ ఏపీఎంలు, సీసీలు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రల పంపిణీ



ఐరన్ మాత్ర మింగిస్తున్న ఎంపీహెచ్ఈవో రాజు

రాంబిల్లి : పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా వుండవచ్చునని దిమిలి పీహెచ్‌సీ ఎంపీహెచ్‌ఈవో ఎస్.ఎస్.వి.ఎన్ రాజు అన్నారు. వెంకటాపురం పాఠశాలలో గురువారం ఆయన రక్తహీనత వున్న పలువురు విద్యార్థులకు ఐరన్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా ఆయన రక్తహీనత సమస్య లేకుండా వుండేందుకు ఆకుకూరలను ఎక్కువగా తినాలన్నారు. ప్రభుత్వం రక్తహీనత నివారణకు ఉచితంగా ఐరన్ మాత్రలను అందజేస్తుందన్నారు. రక్తహీనత వుంటే పలు రకాల సమస్యలు తలెత్తుతాయని హెచ్చరించారు. వ్యక్తిగత , పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం అక్షయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

పాయకరావుపేట : నక్కపల్లి మండలం, చినాతీనార్ల గ్రామం సమీపాన అక్రమంగా నాటు సారా తయారు చేస్తున్న అదే గ్రామానికి చెందిన రంగాల అప్పలరాజు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు గురువారం తెలిపారు. 20 లీటర్ల సారాను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసిన నిందితుడిని కోర్టుకి తరలించినట్టు తెలిపారు. ఎస్ఈబీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నాటు సారా తయారీ, అమ్మకాలు, అక్రమ మద్యం అమ్మకాలపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు.

రూ.8.75 లక్షలకు సంత వేలం ఖరారు

అచ్యుతాపురం : అచ్యుతాపురం బహిరంగ సంత వేలం పాట గురువారం నిర్వహించారు. గల్లా సన్యాసినాయుడు రూ.8,75,000లకు వేలం దక్కించుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో సంత ఫీజు వసూలుకు వేలం నిర్వహించారు. ఎంపీడీవో సురేశ్‌కుమార్, ఈఓఆర్‌డీ శ్రీరాములునాయుడు, సర్పంచ్ విమలకుమారి, కార్యదర్శి అమ్మాజీ పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు తీసుకురావాలి



డిప్యూటీ డీఈవో అప్పారావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : ఉపాధ్యాయులంతా అంకితభావంతో పని చేసి 10 వ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు తీసుకురావాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు అన్నారు. డిప్యూటీ డీఈవో బాధ్యతలు చేపట్టి తొలిసారిగా కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో గురువారం సందర్శించడంతో పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈవో పాఠశాలలో టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. శత శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులకు మెలకువలు నేర్పాలన్నారు.

ఘనంగా పోతురాజుబాబు పండుగ



ఆలయం వద్ద పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

యలమంచిలి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో పండగ సందడి నెలకొంది. లైనుకొత్తూరు, మర్రిబంద, సోమన్నపాలెం, మల్లవరం, బీరకాయలపాలెం, రామకృష్ణాపురం కాలనీల్లో గురువారం పోతురాజుబాబు పండుగ భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మర్రిబంద, లైనుకొత్తూరు గ్రామాల్లో పోతురాజుబాబు ఆలయాల వద్ద భక్తులు దర్శనానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చి పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. గురువారం సాయంత్రం తీర్థం వైభవంగా జరిగింది.